నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, సోమవారం 22 జనవరి 2024 | HYDERABAD

గాజులరామారం చిత్తారమ్మదేవి జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

జాబితాలో తప్పులు ఉండొద్దు

ఓటర్ల నమోదు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి: రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సిటీబ్యూరో/బండ్లగూడ జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సమర్థవంతంగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ గ్రామం పరిధిలోని వికాస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు.

కొత్త ఓటరు నమోదుకు విశేష స్పందన..

ఓటరు నమోదులో భాగంగా గ్రేటర్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన వచ్చింది. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని చాలా మంది సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలో ఓటు హక్కు కోసం దాదాపు మూడు వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓట్ల తొలగింపునకు 1000 మందికిపైగా, చిరునామా మార్పు, వివరాల సవరణకు 2వేలకు పైగా అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ బీరప్ప

నిమ్స్‌లో ఎంఎస్‌కు ఆధునిక వైద్యం

- **డైరెక్టర్ డాక్టర్ బీరప్ప**

ఖైరతాబాద్, జనవరి 21 : నిమ్స్ దవాఖానలో మల్టిపుల్ స్కెలరోసిస్ (ఎంఎస్)కు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఆదివారం దవాఖానలోని న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో లెక్చర్ హాల్‌లో మల్టిపుల్ స్కెలరోసిస్ అప్‌డేట్ పేరుతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ ఎంఎస్ వ్యాధిబారిన పడిన వారికి మధుమేహ రోగుల మాదిరిగా తిమ్మిర్లు, మంటలు, నీరసం ఉంటుందని తెలిపారు. మెదడుకు సంకేతాలను పంపించే నరాలపై మైలిన్ పొర కప్పి ఉంటుందని, అది దెబ్బతిన్న వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారికి ఆధునిక చికిత్స విధానాలు నిమ్స్ దవాఖానలో అందుబాటులో ఉన్నాయని, వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ సదస్సులో నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అఫ్సాన్ జబీన్, ప్రొఫెసర్ సూర్యప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్ శిరీష, వైద్యులు సుల్తానా షేక్, మహేశ్, కిమ్స్ వైద్యులు మోహన్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లంతా నా వైపే..

- **మేయర్ మేకల కావ్య**

జవహర్‌నగర్: 'కార్పొరేటర్లంతా నా వైపే ఉన్నారు. బలవంతంగా కార్పొరేటర్లను బస్సులో ఎక్కించుకొని పోయినంత మాత్రానా అవిశ్వాసం నెగ్గలేరు. క్యాంపులో ఉన్న కార్పొరేటర్లంతా నాతో ఫోన్‌లో సంభాషిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గుతా'.. అంటూ మేయర్ మేకల కావ్య ధీమా వ్యక్తం చేశారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం మేయర్ మేకల కావ్య అవిశ్వాసంపై స్పందిస్తూ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అద్భుతమైన ప్రగతి పనులు చేశామని, ప్రతి డివిజన్‌లోనూ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లను ఉచితంగా అందజేశామని గుర్తు చేశారు. ' నాపై జరుగుతున్న కుట్రలను తిప్పి కొడతాం. చదువుకున్న మహిళ... పాలనలో ప్రగతి సాధిస్తుందని ఓర్వలేకపోతున్నారు. జవహర్‌నగర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాను. చదువు, సమాజంపై అవగాహన లేని వారిని కుర్చిలో కూర్చోబెడితే వారు ఆడిందే ఆటా... పాడిందే పాటగా మారుతుందని భ్రమలో ఉన్నారు. వారి ఆటలు ఇకపై సాగినివ్వం... అవిశ్వాసంపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. పూర్తి మెజార్టీ ఇప్పటికే ఉంది' అని చెప్పారు.

తెలంగాణ భవన్‌లో జరిగిన మల్కాజిగిరి పార్లమెంట్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కష్టపడుదాం.. సత్తా చాటుదాం

అభివృద్ధే గెలుపునకు నాంది

'మల్కాజిగిరి' స్థానం గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వ్యూహరచన

భారీ మెజార్టీతో గెలిచి.. చరిత్ర సృష్టించాలి

శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

మేడ్చల్, జనవరి 21(నమస్తే తెలంగాణ): దేశంలో అతిపెద్ద మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వ్యూహ రచనతో ముందుకెళ్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్‌లో చేసిన అభివృద్ధి పనులు చూసి.. ప్రజలు మల్కాజిగిరి పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తాచాటేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందులోభాగంగా ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం జరిగింది. పార్లమెంట్ ఎన్నికల కార్యాచరణ, గెలుపు వ్యూహాలపై చర్చించి సమావేశానికి హాజరైన వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగిరేలా అందరం కష్టపడుదాం.. సత్తాచాటుదాం.. తెలంగాణ ఏకైక గొంతుక బీఆర్ఎస్సే.. పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై పోరాడిన చరిత్ర బీఆర్ఎస్‌దే.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఢిల్లీలో తెలంగాణ గొంతుక వినబడాలంటే బీఆర్ఎస్సే గెలవాలనే లక్ష్యంతో పనిచేసి మల్కాజిగిరి లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలుచుకొని.. చరిత్ర సృష్టిద్దాం' అని కేటీఆర్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చేసిన అభివృద్ధే గెలుపునకు నాంది అని.. లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరిలో విజయం బీఆర్ఎస్‌దేనని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేసి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

లవ్ మై ఇండీ డాగ్ షో

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ బ్లూక్రాస్ ఆధ్వర్యంలో దోమలగూడలోని చైతన్య విద్యాలయంలో 'లవ్ మై ఇండీ డాగ్ షో' రెండో ఎడిషన్‌ను ఆదివారం ఆ సంస్థ చైర్‌పర్సన్ అమల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీధి కుక్కలను పెంచుకుంటున్న అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జంతు సంక్షేమాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో బ్లూక్రాస్ పనిచేస్తున్నదని అమల అన్నారు. వీధి కుక్కలను గౌరవించడం బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'లవ్ మై ఇండీ డాగ్ షో' అనేక జంతు ప్రేమికులను ఒక వేదికపైకి చేర్చుతున్నదన్నారు. కార్యక్రమంలో మార్స్‌పెట్కేర్ ఇండియా సేల్స్ డైరెక్టర్ నితిన్ జైన్, డాక్టర్ శుభం, డాక్టర్ లక్షి తదితరులు పాల్గొన్నారు.

కళా హీనంగా ఆకృతులు

గతంలో నగర సుందరీకరణలో భాగంగా డివైడర్ల మధ్యలో అందమైన ఆకృతులను ఏర్పాటు చేశారు. బల్దియా నిబ్బంది నిర్వహణలోపంతో దుమ్ముధూళితో ఇప్పుడవి కళాహీనంగా మారుతున్నాయి. కొందరు వాటిని సొంత అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. ఎల్బీనగర్ చింతల్‌కుంట కూడలిలో కళాకృతుల పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు.

ఆనవాయితీకి భిన్నంగా..

- **ఈసారి స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండానే.. సర్కారుకు బల్దియా బడ్జెట్ ప్రతిపాదన**
- **కోడ్ ముగిసినా.. రాని 'స్టాండింగ్ కమిటీ' ఎన్నికల నోటిఫికేషన్**

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ చరిత్రలో లేని విధంగా కొత్త సంప్రదాయానికి కమిషనర్ తెరలేపారు. ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ. 6వేల కోట్లకు పైగా బడ్జెట్‌ను రూపొందించి అమలు చేస్తున్నది బల్దియా. స్టాండింగ్ కమిటీ ఆమోదం, సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనను ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం తెలిపిన తర్వాతే ప్రభుత్వ అనుమతి తీసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ సారి స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండానే ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదన చేరేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికను, కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటుపై కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. బల్దియా చరిత్రలోనే లేని విధంగా హక్కులను కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. వాస్తవంగా స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీ కాలం గతేడాది అక్టోబరులో ముగిసింది. నవంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని అనుకున్నా.. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. డిసెంబర్ మొదటి వారంలో ఎన్నికల కోడ్ ముగిసినా.. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికలను తొందరగా నిర్వహించాల ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు ఆదేశాలు ఇచ్చినా.. ఆయన పెడచెవిన పెడుతూ వస్తున్నారు. ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత కమిషనర్‌దే. నూతన ప్రభుత్వం ఏర్పడటం వల్ల స్టాండింగ్ కమిటీకి సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వ నోటీసులో పెట్టి, ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. కాలయాపన చేస్తున్నారని కమిషనర్‌పై కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

గగనపు వీధి.. శిఖరపు అంచునుంచి..

బేగంపేట విమానాశ్రయంలో 'వింగ్స్ ఇండియా-2024 వైమానిక ఎగ్జిబిషన్ అట్టహాసంగా ముగిసింది. నాలుగు రోజులుగా వైభవంగా సాగిన ఈ ప్రదర్శనకు చివరి రోజు ఆదివారం భారీగా సందర్శకులు తరలివచ్చారు. విభిన్న విమానాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. లోహ విహంగాల విన్యాసాలను చూసి.. అబ్బురపడ్డారు. బోయింగ్, ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిల్వగా.. వాటి వద్ద చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సెల్ఫీలు తీసుకుంటూ..మురిసిపోయారు. జోగిపేట నుంచి వచ్చిన సుమలత అనే మహిళ హెలికాప్టర్లు గాలిలో చేసిన విన్యాసాలు చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. ఇలా చూడటం ఫస్ట్‌టైం అంటూ.. తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పట్నం.. పరవశం

మల్లన్న దర్శనంతో పులకించిన భక్తజనం

నేడు కొమురవెల్లి క్షేత్రంలో పెద్ద పట్నం, అగ్నిగుండం

గజ్జెల లాగులు.. ఢమరుక నాదాలు.. డోలు చప్పుళ్లు.. అర్చకుల పూజలు.. ఒగ్గు పూజారుల పట్నాలు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. ఆదివారం పట్నం వారంతో క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న నామస్మరణతో క్షేత్రం పరవశించింది.

ఒగ్గు పూజారితో పట్నం వేయించి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

13 చోట్ల కలెక్షన్ పాయింట్లు

పక్కాగా నిర్మాణ రంగ వ్యర్థాల తరలింపు

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియను మరింత పకడ్బందీగా చేపడుతూ జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకున్నది. నగరం నలువైపులా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లను ఏర్పాటు చేసి.. భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం)లోకి తీసుకొస్తున్నారు. తొలుత జీడిమెట్ల, నాగోల్ ఫతుల్లాగూడలో సీ అండ్ డీ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, శంషాబాద్, తూంకుంటలో ఇటీవల అదనంగా రెండు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంట్ నుంచి రోజుకు 500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను శుద్ధి చేస్తున్నారు. అయితే అక్రమ డంపింగ్‌లు, వ్యర్థాల తరలింపులో ఇష్టారీతిన కొందరు యజమానులు వ్యవహరిస్తుండడంతో 13 వ్యర్థాల కలెక్షన్ పాయింట్లను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చారు. శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించి 9705433369, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్ పరిధికి 8885737472, 6302074614 నంబర్లలో సంప్రదించాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. అలాగే ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్, అంబర్‌పేట, యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో వాట్సాప్ 1800 120 1159, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీ పురం, పటాన్‌చెరు, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్‌కు సంబంధించి 9100927073, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, కాప్రా, ముషీరాబాద్, ఖైరతాబాద్, అల్వాల్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్‌కు సంబంధించిన వాట్సాప్ 18002030033, 7330000203 నంబర్లను సంప్రదించి వ్యర్థాలను జీహెచ్ఎంసీకి అప్పగించాలన్నారు.